| | | | |
|---|---|---|---|
| రాగం | : | రచన | : రాయప్రోలు సుబ్బారావు |
| తాళం | : | సంగీతం | : |
| | | గానం | : |

# 113. ఏ దేశమేగినా

ఏ దేశ మేగినా, ఎందు కాలిడిన

ఏ పీఠ మెక్కినా, ఎవ్వ రేమనిన

పొగడరా ! నీ తల్లి భూమి భారతిని,

నిలుపరా ! నీ జాతి నిండు గౌరవము !

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమొ,

జనియించినాడ నీ స్వర్గఖండమున

ఏమంచి పూవులన్ ప్రేమించినావొ

నిను మోచె ఈ తల్లి కనకగర్భమున !

లేదురా ఇటువంటి భూదేవి యెందు

లేరురా మనవంటి పౌరు లింకెందు !

సూర్యుని వెలుతురుల్ సోకునందాక,

ఓడల జెండాలు ఆడునందాక !

అందాక గల ఈ యనంత భూతలిని
మన భూమి వంటి చల్లని భూమి లేదు !
పాడరా నీ తెన్గు బాలగీతములు
పాడరా నీ వీర భావభారతము !

తమ తపస్సులు ఋషుల్ ధారపోయంగ,
శౌర్యహారము రాజచంద్రు లర్పింప,
భావ సూత్రము కవిప్రభువు లల్లంగ
రాగదుగ్ధము భక్తరత్నముల్ పిదుక

దిక్కుల కెగదన్ను తేజమ్ము వెలుగ
రాళ్ళ తేనియ లూరు రాగాలు సాగ
జగముల నూగించు మగతనం బెగయ
సౌందర్య మెగబోయు సాహిత్య మలర

వెలిగిన దీ దివ్య విశ్వంబు పుత్ర !

దీపించె నీ పుణ్యదేశంబు పుత్ర !

పొలముల రత్నాలు మొలిచెరా యిచట

వార్ధిలో ముత్యాలు పండెరా యిచట

పృథ్విని దివ్యౌషధుల్ పిదికెరా మనకు

కానల కస్తూరి కాచెరా మనకు

అవమాన మేలరా, అనుమాన మేల ?

భరత పుత్రుడ నంచు భక్తితో పలుక !